

# అబిట్యూరీ

– తిరుమలశ్రీ

"ప్రముఖ సినీ నటుడు, దర్శకుడు శ్రీ నటనానంద్ గత రాత్రి పది గంటలకు మద్రాసులో విజయరాఘవాచారి రోడ్‌లో వున్న తన నూతన స్వగృహంలో హృద్రోగంతో మరణించారని తెలుపుటకు మిక్కిలి చింతిస్తున్నాము...

అరవై ఏళ్ళ శ్రీ నటనానంద్ దాదాపు రెండువందల చిత్రాలలో నాయకుడిగా నటించి ప్రేక్షకుల అభిమానాన్ని ఎంతో చూరగొన్నారు. ఆయన తెలుగులోనే కాక తమిళ, కన్నడ భాషలలో కూడా నటించి పలు ప్రశంసలను అందుకున్నారు. ఆయన నటించిన చిత్రాలలో అనేకం శతదినోత్సవాలను చేసుకోవడమే కాక, ఎన్నో అవార్డులను గెలుచుకున్నాయి. నటుడిగా, దర్శకుడిగా ఆయన లెక్కకు మించిన బహుమతులు గెలుచుకున్నారు.

నిజానికి శ్రీ నటనానంద్‌కి అసలు నటనే రాదు! అందుకే ప్రతి పాత్రలోనూ జీవించే వారాయన!! చిత్రానికి, జీవితానికి తేడా తెలిసేది కాదు ఆయనకు. ఏ పాత్ర పోషించినా ఆ పాత్రకు జీవం పోసేవారు.

శ్రీ నటనానంద్‌కి దర్శకత్వం కొత్తగా చేతకాదు! తాను దర్శకత్వం వహించిన చిత్రాలలోని పాత్రలకు ప్రాణంపోసి చేయిపట్టి నడిపించడమే ఆయనకు తెలుసు!!

శ్రీ నటనానంద్ చిత్రసీమకు చేసిన సేవ అద్వితీయం. ఆ కళకే కళతెచ్చిన

ఉత్తమ కళాకారుడు ఆయన!...ఆయన మరణంతో ఆంధ్రదేశం ముఖ్యంగా చిత్రరంగం ఒక కళామేధావిని శాశ్వతంగా కోల్పోయినందుకు మనం సానుభూతి ఆ రంగానికి తెలుపవలసివుందంటే అతిశయోక్తి కాదు!

శ్రీ నటనానంద్ యొక్క భార్య, ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెల పరివారంలో యావదాంధ్రం పాలుపంచుకుంటోంది..."

అనాటి పత్రికలో ప్రచురింపబడిన పై 'అబిట్యూరి' (డెత్ రిపోర్టు)ని చదివిన 'వినాదం' దినపత్రిక సిబ్బంది మెచ్చుకోలుగా మార్కండేయులు వంక చూసారు.

ఆ అబిట్యూరి రాసింది మార్కండేయులే. పేరున్న ఓ ఫ్రీలాన్స్ జర్నలిస్టు అతను. ముఖ్యంగా ప్రముఖ వ్యక్తుల అబిట్యూరీస్‌ని రాయడంలో సిద్ధహస్తుడు. అబిట్యూరీ రైటప్‌లో అతని ప్రత్యేకతను గుర్తించిన 'వినాదం' అతన్ని తమ పత్రికకు పర్మనెంటు అబిట్యూరి రైటర్‌గా ఏర్పాటుచేసుకుంది.

అతను రాసే పద్ధతి ఎంతో ఆసక్తికరంగా, మరణించినవారి పట్ల చదువరులకు శ్రద్ధను కలిగించే విధంగా ఉంటుంది అందుకే అతని అబిట్యూరి రైటప్‌ని ప్రింట్‌లో చూసినపుడల్లా అతని మిత్రులు ఎంతో మెచ్చుకుంటూ వుంటారు అతన్ని.

.ఆరోజు 'నటనానంద్' అబిట్యూరి రిపోర్టుని చదివిన తన మిత్రులలో ఒకరు అన్న పలుకులే ఆ రోజంతా మార్కండేయులి బుర్రలో బొంగరంలా తిరగసాగాయి.

"అబిట్యూరీ రాయడమంటే మాటలు కాదు. ఇతర విషయాలను రిపోర్టు చేసినంత సులభం కాదు. అదొక కళ. అబిట్యూరి ఎందరో రాస్తారు. కాని అందులో ప్రత్యేకతను సాధించింది మన మార్కండేయులు ఒక్కడేనంటే అతిశయోక్తి కాదు..." అన్నాడు ఒక మిత్రుడు.

అవునౌనంటూ మనస్పూర్తిగా అతనితో ఏకీభవించారంతా.

"కాని..." అంటూ అతను ఆగడంతో, ఇతరులతో పాటు మార్కండేయులు కూడా ఆశ్చర్యంతో చూసాడు అతనివంక, ఏమిటా అని.

"ఎందరికో అబిట్యూరీస్ ఎంతో చాతుర్యంతో రాసిన మన మార్కండేయులు మరణిస్తే — గాడ్ ఫర్‌బిడ్! — అతని అబిట్యూరి అతనంత చక్కగా రాయగలవారుంటారో లేదో!" అన్నాడతను చిరునవ్వుతో.

అతని పాయింటు అర్థమైపోయింది అందరికీను

"మరైతే తన అబిట్యూరి తానే రాసుకుంటే బావుంటుంది!" అంటూ తన జోక్‌కి తానే పగలబడి నవ్వాడు ఇంకొక మిత్రుడు.

"అదెలా?" అని మరొకరు తెల్ల మొగం వేస్తే...,

"ఇప్పుడే రాసిపెట్టుకుంటే సరి!" అంటూ జవాబిచ్చాడు వాలుగోపాదు.

మార్కండేయులుతో సైతం పెద్దగా నవ్వుతున్నారంతా.

అయితే ఆ సంభాషణను అందరూ అక్కడే మరిచిపోయినా, మార్కండేయులు బుర్రలో మాత్రం రికార్డ్ అయిపోయిందది. ఎరేజ్ చేయాలనుకున్నా వీలుకాలేదు. సో, తీవ్రంగా ఆలోచించడం ఆరంభించాడు అతను.

తన మిత్రులు నవ్వులాటకే అని వుండుగాక! తన ఆబిట్యూరిని తానే రాసి వుంచుకోవడంలో తప్పేముంది!... అనిపించింది.

ఇకనేం! మూడురోజుల తీవ్రాలోచన అనంతరం తన ఆబిట్యూరిని తానే రాసుకునేందుకు నిశ్చయించుకున్నాడు మార్కండేయులు.

ఆరాత్రి భోజనంచేసి కూర్చున్నాడు తన సొంత ఆబిట్యూరిని రాసేందుకు.

తీరా కాగితంమీద కలం పెట్టేసరికి వచ్చిపడింది ఓ పెద్ద సందేహం— తన మరణం ఏవిధంగా సంభవించినట్లు రాయాలని!

మరణకారణాన్ని విడిచిపెట్టి మిగతా రైటప్ అంతా రాయాలనుకున్నాడు మొదట. కాని ఎందుకో వెలితిగా అనిపించింది. తన చావు గురించి అంతా తానే స్వయంగా రాసుకోవాలి. అసంపూర్తిగా రాయడం ఇష్టంలేదు.

'ఏదో ఒక కారణం ఊహించి రాస్తాడు తాను ఆ తరువాత దానిని పత్రికలవాళ్ళే మార్చుకుంటారు అవసరమైన 'మేరకు' అనుకున్నాడు.

అయితే మరణకారణం ఏదైతే బావుంటుందన్న ప్రశ్న మళ్ళీ ఎదురైంది సులువైన మార్గాన్నే ఎన్నుకోవాలనుకున్నాడు

చివరకు తన ఆబిట్యూరిని ఈ విధంగా రాసుకున్నాడు—

'ప్రముఖ ఫ్రీలాన్స్ జర్నలిస్టు, ప్రఖ్యాత ఆబిట్యూరి రైటర్ శ్రీ మద్దిల మార్కండేయులి అకాల మరణవార్తను తెలుపుటకు మిక్కిలి విచారిస్తున్నాము.

శ్రీ మార్కండేయులి వయసు నలభై అయిదు. గత ఉదయం మరణించిన ప్రముఖ వ్యక్తి, స్వాతంత్ర్య సమరయోధుడు అయిన శ్రీ సన్యాసిరాజుగారి భౌతికకాయానికి తన శ్రద్ధాంజలిని ఘటించి, సాయంత్రానికల్లా ఆయన గురించి ఓ చక్కని ఆబిట్యూరీ రైటప్‌ని 'వినాదం' సంపాదకుడికి అందజేసారు శ్రీ మార్కండేయులు. ఆ తరువాత తిన్నగా బసంత్‌నగర్‌లో వున్న తన యింటికి చేరుకున్నారు. అలసటగా సోఫాలో వెనక్కివాలి, కళ్ళు మూసుకుంటూ భార్యని మంచినీళ్ళు తెమ్మని చెప్పారు. కాని భార్య నీళ్ళు తెచ్చేసరికి



ఆ కళ్ళు మళ్ళీ తెరుచుకోలేదు.

ఉన్నత ప్రమాణాలతో, సాహితీ విలువలతో ప్రముఖుల ఆబిట్యూరీస్‌ని రాయడంతో తనకంటూ ఓ ప్రత్యేకతను సాధించుకున్న శ్రీ మార్కండేయులు - అద్భుతమైన తన రిపోర్ట్స్‌తో జర్నలిస్టులలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న శ్రీ మార్కండేయులు - చిన్నవయసులోనే అకాల మృత్యువాత పడడం దేశానికే తీరని నష్టం. సుగంధపుష్పాల జీవన పరిమాణం అత్యల్పమే గదా! శ్రీ మార్కండేయులు మానవాళి మధ్య పరిమళించిన మరో పుష్పం. రాతలలో ఆయనకాయనే సాటి. అటువంటి 'మరణ వాఖ్యానాల' రచయిత మనకు మళ్ళీ లభించడు. ఆయన మరణం పత్రికా లోకానికే గొడ్డలిపెట్టు అంటే అతిశయోక్తి కాదు.

బ్రహ్మచారైన శ్రీ మార్కండేయుని మనసు వెన్నలాంటిది. సంఘసేవ ఆయన ఊపిరి. ఏ జబ్బుతోటీ బాధపడకుండా సునాయాసంగా మృత్యువును ఆహ్వానించడం మంచి మనసున్న ఆ మహామనిషికే చెల్లింది. శ్రీ మార్కండేయుని మరణానికి పత్రికాలోకమంతా తీవ్ర సంతాపాన్ని వెలిబుచ్చుతూ, ఆయన గౌరవార్థం రాష్ట్రంలోని పత్రికలన్నీ తమ కార్యాలయాలను నేడు మూసి

వేశాయి...'

మర్నాటి ఉదయం తన సొంత 'ఆబిట్యూరి'ని టైప్‌చేసి, కవరులో పెట్టి, సీలువేసి, 'వినోదం' ఎడిటర్ చేతిలో పెట్టాడు మార్కండేయులు.

"ఇది నా వోన్ ఆబిట్యూరి సార్! ఇది మీకు ఎప్పుడయినా పనికివస్తుందని" అన్న అతనివంక ఓ క్షణం వింతగా చూసి, అంతలోనే పకాలున నవ్వేస్తాడు ఎడిటర్.

విషయం అర్థమయిన సిబ్బందికూడా శ్రుతి కలిపింది.

అంతలోనే-

నగరంలోని ఓ ప్రముఖుడు, స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీ బైరాగి హృద్రోగంతో మరణించినట్లు వార్త అందడంతో, వెంటనే బయలుదేరాడు మార్కండేయులు.

ఆ పూటంతా అక్కడ గడిపి, బైరాగి భౌతికకాయానికి శ్రద్ధాంజలి అర్పించాడు. ఆ తరువాత ఆయన జీవిత వివరాలను సేకరించాడు. అటుపిమ్మట ఓ చక్కని ఆబిట్యూరి రిపోర్టుని తయారుచేసి, సాయంత్రం అయేసరికి 'వినోదం' ఎడిటర్‌కి అందించాడు, ఆనాటి ఎడిషన్‌లో చేర్చేందుకు...

బైరాగి గొప్ప దేశభక్తుడు. పాపులర్ ఫిగర్. రైటప్ ఎంత బావుంటే ఆ పత్రికకు అంత ఘనత. మార్కండేయులు ఫైల్‌చేసిన రైటప్ ఎడిటర్ యొక్క ప్రత్యేక ప్రశంసల్ని అందుకుంది.

అలసిపోయిన మార్కండేయులు చీకటిపడే వేళకు ఇంటికి చేరుకున్నాడు. వేసవి కాలమేమో, ఉసూరుమంటూ సోఫాలో చతికిలబడ్డాడు.

నౌకర్ని చల్లటి మంచినీళ్ళు తెమ్మని చెప్పి, విశ్రాంతిగా వెనుకకు వాలి కళ్ళు మూసుకున్నాడు

నౌకరు మంచినీళ్ళు తెచ్చేసరికే మార్కండేయులి ప్రాణాలు పంచభూతాలలో కలిసిపోయాయి!

ఏదో తమాషాకు అతను సొంతంగా రాసుకున్న ఆబిట్యూరి మర్నాడు 'వినోదం' దినపత్రికలో బాక్స్ కట్టి ప్రచురించబడింది!!

అయితే- దానిని చదువుకునేందుకు మార్కండేయులు మాత్రం లేడు!!!